విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 146 | మంగళవారం 29. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీపై గెజిట్ నోటిఫికేషన్

హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు తెలంగాణ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబర్ 26వ తేదీతో అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి గెజిట్ జారీ చేశారు. బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై ఇటీవల హైకోర్టు అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ స్థానం అప్పటి నుంచి ఖాళీ అయినట్లు గెజిట్ జారీ అయ్యింది.


తెలంగాణ రాజ పత్రము
THE TELANGANA GAZETTE
PART-II EXTRAORDINARY
PUBLISHED BY AUTHORITY
HYDERABAD, SATURDAY, SEPTEMBER 26, 2026.
NOTIFICATIONS BY HEADS OF DEPARTMENTS, Etc.
TELANGANA LEGISLATIVE ASSEMBLY
TELANGANA LEGISLATIVE ASSEMBLY - DISQUALIFICATION OF SRI DANAM NAGENDER MEMBER ELECTED FROM 60-KHAIRATABAD ASSEMBLY CONSTITUENCY VACANCY OF THE SEAT
C.No.210/Legn./2026.

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మతిరిగే ఫలితం: దానం నాగేందర్



హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రభావం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉండదని మాజీ మంత్రి దానం నాగేందర్ అన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలంటూ నెక్లెస్ రోడ్డులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. "ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మతిరిగే ఫలితం వస్తుంది. ఎవడు కొడితే మైండ్ బ్లాక్ అవుతుందో అలా ఉంటుంది. ఈసీని అడ్డుపెట్టుకొని భాజపా ఓటు చోరీ చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు చోరీతోనే కిషన్‌రెడ్డి గెలిచారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి. 'సర్' లోపాల అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి"అని దానం నాగేందర్ అన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. లారీ, ఆటో ఢీ, నలుగురు మృతి



మంచిర్యాల : జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ , ఆటో ఢీ కొన్న ఘటనలో నలుగురు మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. నస్పూర్ మండల కేంద్రంలో ఆటో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు స్పాట్‌లోనే చనిపోగా మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని హుటాహుటినా ఆసుపత్రికి తరలించారు. మృతులు మందమర్రి మండలం పొన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి, వెంకటాపూర్‌కు చెందిన అగ్గు సౌందర్య, సోనియా , సుమలతగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు.

ప్రమాద స్థలాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్, ఏసీపి ప్రకాష్ సందర్శించారు.

## పొంగులేటి ఆస్తులపై విచారణ చేపట్టాలి..



- నగరంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆస్తులపై ఈడీ తక్షణమే విచారణ జరపాలని డిమాండ్
- గతంలో ఈడీ సోదాలు నిర్వహించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదు
- గతంలో సోదాలు జరిపిన అధికారులు ఇప్పుడు ఎందుకు మౌనం వహించారు
- తక్షణమే తదుపరి చర్యలు ఎందుకు చేపట్టడం లేదు
- లోపలికి వెళ్లేందుకు ఎలాంటి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు.
- బీఆర్ఎస్ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది.
- దీంతో ఈడీ కార్యాలయం వద్ద ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో డబుల్ ధమాకా...

- అర్హులకు అందని డబల్ బెడ్ రూమ్ ఇండ్లు..
- అదే కోవాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సైతం..
- పైసా మే పరమాత్మ అంటున్న లీడర్లు, అధికారులు..

సెప్టెంబర్ 27(తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టి.ఎన్ రమేష్)

గత బిఆర్ఎస్ డబల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించినప్పటికీ, అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లను పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించింది. అప్పటికే డబుల్ బెడ్ రూమ్ గృహాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. అంతేకాకుండా గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ గృహాలు శిథిలావస్థకు చేరుకొని, బూత్ బంగ్లాల్ల మారాయి.



### ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రత్యక చొరవతో..

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మదన్ మోహన్ రావు గెలిచిన తర్వాత, ఆయన నిరుపేదలకు, అర్హులైన వారికి, సొంతింటి కల సహకారం చేయాలనే దృఢ సంకల్పంతో, శిధిలవస్థలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ గృహాలను, అన్ని విధాలుగా రిపేర్లు చేయించి, నూతనంగా ముస్తాబు చేయించడం జరిగింది. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పార్టీ కౌన్సిలర్లకు, నాయకులకు, అధికారులకు అందరితో, సమావేశమై డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు లో ఎలాంటి అవకతవక తవకలు జరగడానికి వీలులేదని, నిష్పక్షపాతంగా అర్హులైన ఇండ్లు లేని నిరుపేదలకు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని అధికారులతో సమావేశమై, వారికి స్పష్టంగా హితబోధ చేయడం జరిగింది. ఒకవేళ ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన అర్హులైన పేదలకు అన్యాయం జరిగిన పార్టీ క్యాడర్ పై, అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే మదన్మోహన్ సుస్పష్టంగా చెప్పారు. కానీ మంచి ఉన్న ప్రతి చోట పక్కనే చెడు ఉంటుందనేది సామెత. 'ఇక్కడ వర్తిస్తుంది.'

ఎమ్మెల్యే మాటల్ని బేకాతరూ చేస్తూ, కొందరు రాజకీయ నాయకులు, అధికారులు మిలాఖత్ అయ్యి, సొంత గృహాలు కలిగిన వారికి, అనర్హులు అయినా వారికి, సోమార్పేట్ రోడ్డులో ఉన్నటువంటి, డబల్ బెడ్ రూమ్ గృహాలలో ఇష్ట రీతిన గృహాలు మంజూరు చేయడం జరిగింది. అర్హులమైన తమకు అన్యాయం జరిగింది అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒక్కొక్క ఇంటికి అనర్హులు, రెండు లక్షల రూపాయల నుండి మూడు లక్షల రూపాయల వరకు బ్రోకర్ల ద్వారా సొమ్ము ముట్టజెప్పి, అక్రమ మార్గంలో డబల్ బెడ్ రూమ్ గృహాలను సొంతం చేసుకున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అసలైన నిరుపేదలు డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు అర్హులు, ఇంకా నాయకుల చుట్టూ, అధికారుల చుట్టూ, చెప్పులు అరిగేలా ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి విషయం రాకపోయినప్పటికీ, రానున్న ఎన్నికల్లో ఈ సంఘటనకు సంబంధించి తీవ్ర ప్రభావం ఓటు బ్యాంకు పై పడనున్నట్లు రాజకీయ విశ్లేషకులు తెలుపుతున్నారు.

### బాన్సువాడ

మాజీ మంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే రాజకీయ దురంధరుడు అయిన పోచారం శ్రీనివాసరెడ్డి గత ప్రభుత్వంలో పదివేల డబల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయించుకున్నారు. తన నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా ఆయన గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ద్వారా ప్రత్యేకంగా బాన్సువాడ నియోజకవర్గం 10,000 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సాధించుకోవడంలో సఫలీకృతులయ్యారు. ఇప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లను కూడా వేలాదిగా తన నియోజకవర్గానికి తీసుకువచ్చిన ఘనత పోచారం శ్రీనివాస్ రెడ్డి కి దక్కింది. కానీ ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తూ ఆయన చుట్టూ ఉన్న చోట మోట నేతలు కొందరు కౌన్సిలర్లు ధనం మూలం ఇదం జగత్ అన్నచందంగా అర్హులైన పేద ప్రజలను పక్కనపెట్టి సొమ్ములు ఇచ్చిన వారికి డబల్ బెడ్ రూమ్ గృహాలను కట్టబెట్టారు అని అపవాదు లేకపోలేదు. ఆయన అనుచర గణంలో కొందరు ఒక్కొక్క ఇంటికి అనర్హుల నుండి, లక్షల్లో దండుకొని వారిని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లోకి అధికారికంగా పంపించారని ఆరోపణలు ప్రజల నుండి వినిపిస్తున్నవి.

### దేవుడు కరుణించిన పూజారి అడ్డుకున్న విధంగా!

నిత్యం పోచారం శ్రీనివాస్ రెడ్డి చుట్టూ గుంపులుగా ఉండే, అనుచరులు, అధికారులు కుమ్మక్కై, అర్హులైన నిరుపేదలకు 40 శాతం ఇండ్లను కేటాయించి, మమ అనిపించారు. మిగతా 60 శాతం డబుల్ బెడ్ రూమ్ గృహాలను లక్షల రూపాయలకు బేరా సారాలు కుదుర్చుకొని, ఇటు క్రింది స్థాయి నాయకులు, కౌన్సిలర్లు అటు అధికారులు, లక్షలాది రూపాయలు పంపకాలు జరుపుకున్నట్లు ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### గతమెంతో ఘనమైనదా:

కొందరు ప్రబుద్ధుల కారణంగా ఒక సబ్ రిజిస్ట్రార్ అధికారి బలి అయిన సంఘటన సైతం ప్రజలు మర్చిపోలేకుంటున్నార బాన్సువాడ విషయానికి వస్తే, అక్కడి చోటామోటా నేతలు, పైరవీకారులు, రాజకీయ నాయకులను, అధికారులను, ప్రసన్నం చేసుకొని తమరికి నచ్చిన వారికి, డబ్బు లక్షలు చెల్లించిన వారికి, ఆర్థిక స్తోమత లేక అందం మాత్రమే ఉన్నవారికి సైతం, అనర్హులైనప్పటికీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టబెట్టడంలో సక్సెస్ అయ్యారు అని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. మొత్తంగా ఈ రెండు నియోజకవర్గాల్లో బ్రోకర్లు మధ్య నుండి అధికారులను, రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకొని, ఎవరికి కావలసింది వారు, ఏది కావాలో అది ముట్ట చెప్పినట్లు, విశ్వాసనీయ సమాచారం.

### ఉదాహరణకు:

ఠాకూర్ రంజిత (భర్త కీర్తిశేషులు ఠాగూర్ జగదీప్ సింగ్) కు బాన్సువాడ ఫారెస్ట్ ఆఫీసును ఆనుకొని రెండంతస్తుల పెద్ద ఇల్లు ఉన్నది. అయినా రాజకీయ దురంధరుడిగా పేదల పెన్నిధిగా పేరుగాంచిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆశయాలకు తిలోదకాలు ఇస్తూ, ఆయన అనుచర గణం సదరు మహిళలకు ఇల్లు ఉండగానే అనర్హురాలు అని తెలిసి కూడా ఏం తీసుకున్నారు ఎంత ఆశించారో ఏమి ఇచ్చిందో తెలియదు కానీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఈవిడకి కట్టబెట్టారు. ఇలా పేర్లు రాస్తూ పోతే 1,000 కి పైగా అక్రమార్కుల చిట్టా బయటపడుతుంది. ఆవిడ నుంచి చోటామోటా లీడర్లకు, అధికారులకు ఏం దక్కిందో దీనిపై పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎలాంటి ఎంక్వయిరీ వేస్తారో? ఎంతమంది అరువులకు న్యాయం చేస్తారో వేచి చూడాల్సిందే !!

## ఆ రెండు సార్లు కాంగ్రెస్ అభ్యర్థుల్ని ఓడించా



- ఉత్తర భారత్, దక్షిణ భారత్‌లో రాజకీయాల శైలి వేరు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తెలంగాణలో విద్యార్థి సంఘాలు చాలా తక్కువగా ఉంటాయి
- లెఫ్ట్, రైట్ సంఘాలున్నాయని, ఎన్ఎస్‌యూఐ ప్రభావం పెద్దగా లేదు
- యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘంలో ఉన్నా.. గ్రామంలో మాత్రం కాంగ్రెస్‌లో ఉంటారు
- తెలంగాణలో భాజపాకి పెద్దగా ప్రాధాన్యత లేదు
- విద్యార్థి రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే.. రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉంది
- అప్పట్లో నాకు జిల్లా కాంగ్రెస్ నేతలతో పెద్దగా సంబంధాలు లేవు.
- ప్రభుత్వంపై పోరాడాలంటే ప్రతిపక్షమే మేలని భావించా.
- అందుకే నాడు తెలుగుదేశంలో చేరా. తెదేపా నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలిచా.
- అప్పుడు తెదేపా కేంద్రంలో ఎన్డీఏతో ఉంది. ఏపీలో ఎన్డీయే ఉంది.
- తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. నేను రెండింటితో పోరాడాల్సి వచ్చింది.
- 2014 ఎన్నికల తర్వాత కేసీఆర్, రేవంత్ మధ్య పోటీగా మారింది.
- కేసీఆర్ నన్ను అనేకసార్లు జైలుకు పంపారు. నేను అసెంబ్లీ కంటే జైలుకే ఎక్కువ సార్లు వెళ్లాను.
- నాయకత్వం ఏపీలో ఉండటంతో తెదేపాకి తెలంగాణలో ప్రాధాన్యం తగ్గింది.
- రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ సహా శ్రేయోభిలాషులంతా కాంగ్రెస్‌లో ఉన్నారు.
- రాహుల్ గాంధీని కలిసి 15 నిమిషాలు మాట్లాడాం.

## ఎలక్షన్ కమిషన్ బీజేపీకి తొత్తు

- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, మహేష్ కుమార్ గౌడ్
- కేంద్రంలోని నరేంద్ర మోడీ, అమిత్ షాల వైఖరితో దేశంలో ప్రజాస్వామ్యం తీవ్ర ముప్పు
- ప్రపంచ దేశాలన్నీ భారత్ తీరు చూసి ముక్కున వేలేసుకుంటున్నాయి
- కేంద్ర ప్రభుత్వ సూచనలతో ఎలక్షన్ కమిషన్ (ఈసీ) బీజేపీకి తొత్తుగా మారి,
- ఎన్నికల కమిషన్ తీరుతో ఓటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది



## ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ నిరసన

### సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్.. దిష్టిబొమ్మ దహనం




**నిజామాబాద్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎస్ఐఆర్, ఓటర్ల జాబితా సవరణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్ నుంచి రైల్వే స్టేషన్ చౌరస్తా మీదుగా గాంధీచౌక్ వరకు ర్యాలీ చేపట్టి, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఇదే అంశంపై నిరసనలు చేపట్టినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అనంతరం సీఈసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో తాహెర్ బిన్ హందన్, ఈరవత్రి అనిల్, కేశ వేణు, అంతరెడ్డి రాజిరెడ్డి, గడుగు గంగాధర్, రాంభూపాల్, నరాల రత్నాకర్, అన్వేష్ రెడ్డి, కుంట రమేష్ రెడ్డి, పుప్పాల విజయ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా గొజ్జ జనార్దన్

### నిర్మల్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి విలేఖరి)**
: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 15 మంది సభ్యులు పూర్తి కోరంతో ఎన్నికల్లో పాల్గొన్నారు. చైర్మన్ పదవికి పోటీ చేసిన యాటకారి సాయన్న, గొజ్జ జనార్దన్‌లో అత్యధిక మెజార్టీతో గొజ్జ జనార్దన్ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా ఎంసీ లింగన్న, ట్రెజరర్‌గా అల్లాడి రవి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా సామనపల్లి రాఘవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి కె. సత్యనారాయణ ఆధ్వర్యంలో సహాయ ఎన్నికల అధికారి శరత్‌బాబు, సాయందర్ తదితరుల సమన్వయంతో ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: అదనపు కలెక్టర్ భుజంగరావు



**నిజామాబాద్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు అన్నారు. సోమవారం ఎస్ఎస్ఆర్ కళాశాలలో వైద్యారోగ్యశాఖ, మేరా యువభారత్, విద్యాశాఖ ఆధ్వర్యంలో 'నశాముక్త యువ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మత్తు పదార్థాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజశ్రీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మానసిక సమస్యలపై 14416 టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవచ్చన్నారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రవితేజ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన వారికి జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని డీ-అడిక్షన్ కేంద్రంలో ఉచిత చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఈఓ రవికుమార్, డీఐఓ డాక్టర్ అశోక్, డాక్టర్ సికందర్ నాయక్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ నవ్య, డాక్టర్ భార్గవి, డాక్టర్ శిఖరా, దుర్గారావు, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దు



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి విలేఖరి):**
ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ సమస్యలను శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో హాకీ పోటీలు

**కొత్తగూడెం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న హాకీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్-14, అండర్-17 బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. గతంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐసీఎస్, ఎస్వీవో తదితర క్రీడా పోటీల్లో పాల్గొన్నవారు, కేంద్రీయ విద్యాలయ, నవోదయ, విద్యాభారతి పాఠశాలల విద్యార్థులు అర్హులు కారని తెలిపారు. క్రీడాకారులు ప్రధానోపాధ్యాయుల అటెస్టేషన్‌తో జిరాక్స్ పత్రాలు, ఎలిజిబిలిటీ ఫారం, బోనఫైడ్, ఆధార్, శాశ్వత విద్యా సంఖ్య, గత విద్యా సంవత్సరం మార్కుల మెమో, పాఠశాల ఎస్జీఎఫ్ అనుబంధ రుసుము చెల్లింపు రసీదు తదితర ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. ఎస్జీఎఫ్ ఖమ్మం కార్యదర్శి డా. ఎస్. రామారావు, భద్రాద్రి కొత్తగూడెం కార్యదర్శి బి. భావసింగ్ తెలిపారు. వివరాలకు కోచ్ నిఖిల్‌ను 9502536560లో సంప్రదించాలని కోరారు.

# జర్నలిస్టుల ఇళ్ల కలకు మరింత ఊతం!

- వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా లాయక్ పాషా ఏకగ్రీవం
- విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో మరింత ముందుకు



**వేములవాడ,సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
వేములవాడ ప్రాంతంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందించడంతోపాటు ఇప్పటికే మంజూరైన స్థలాలతో ఏర్పడుతున్న జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి సమన్వ యంతో ముందుకు సాగేందుకు వేములవాడ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి లాయక్ పాషాను చైర్మన్‌గా ఏకగ్రీవంగా నియమిస్తూ ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

**మంజూరైన స్థలాల అభివృద్ధిపై దృష్టి :**
వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో సర్వే నంబర్ 391లో జర్నలిస్టుల కోసం మంజూరైన నివేశన స్థలాలతో కాలనీ రూపుదిద్దుకుంటోంది,అయితే స్థలాలు మంజూరు కావడం ఒక దశ మాత్రమేనని వాటిని నివాసయోగ్యంగా మార్చేందుకు రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ లాయక్ పాషా తెలిపారు.

**60 మంది జర్నలిస్టుల స్థలాల కోసం గతంలో ప్రయత్నం :**
వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన ప్రక్రియలో గతంలోనూ లాయక్ పాషా కీలకంగా పనిచేశారు,సుమారు 60 మంది జర్నలిస్టులకు నివేశన స్థలాలు కల్పించేందుకు జరిగిన ప్రయత్నాల్లో ముఖ్య భాగస్వామ్యం కావడంతో పాటు, ప్రస్తుతం ఏర్పడుతున్న కాలనీకి సంబంధించిన పలు అంశాలపై అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు.

**కాలనీలో తొలి అడుగులు :**
జర్నలిస్టు కాలనీలో మొట్టమొదటిసారిగా బొడ్రాయి ఏర్పాటు చేసి నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం, ఇంటి నంబర్ తీసుకోవడం వంటి కార్యక్రమాలు లాయక్ పాషా ఆధ్వర్యంలోనే జరిగాయి. కాలనీకి విద్యుత్ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది ఇవి కాలనీ నిర్మాణానికి ప్రాథమిక వసతులు ఏర్పడుతున్నాయ నడానికి సంకేతాలుగా నిలుస్తున్నాయి.

**నీటి సమస్యకు రెండు బోర్లు :**
కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనపై ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు లాయక్ పాషా తెలిపారు. జర్నలిస్టు కాలనీ అవసరాలను వివరించడంతో రెండు బోరుబావులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.నీటి వసతి ఏర్పాటైతే కాలనీలో నిర్మాణ పనులు, భవిష్యత్తులో నివాసం ఏర్పరుచుకునే కుటుంబాలకు కొంతమేర ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

**మిగిలిన అర్హులకూ స్థలాలే లక్ష్యం :**
ప్రస్తుతం మంజూరైన స్థలాలతో పాటు ఇంకా కొంతమంది అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందాల్సి ఉందని లాయక్ పాషా తెలిపారు.అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి స్థలాల సాధనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

**సొసైటీ ముందున్న అసలు సవాలు ఇదే :**
హౌసింగ్ సొసైటీకి చైర్మన్ నియామకంతో బాధ్యత పూర్తికాదని,ఇప్పటికే మంజూరైన స్థలాలను పూర్తి స్థాయి జర్నలిస్టు కాలనీగా తీర్చిదిద్దడమే అసలు సవాలన్నారు, వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమంపై మరింత ముందుకు సాగుతామన్నారు.భూమి, రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలతో పాటు అర్హులైన మిగిలిన జర్నలిస్టులకు స్థలాల సాధన, ప్రభుత్వ శాఖలతో నిరంతర సమన్వయం వంటి అంశాలు సొసైటీ ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి.ఈ నేపథ్యంలో హౌసింగ్ సొసైటీని సమర్థవంతంగా నిర్వహిస్తూ జర్నలిస్టులందరి భాగస్వామ్యంతో కాలనీ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఏకగ్రీవ నియామకంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, జర్నలిస్టుల ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని లాయక్ పాషా తెలిపారు.హౌసింగ్ సొసైటీ చైర్మన్ గా నియమితులైన లాయక్ పాషకు పుర ప్రముఖులు, న్యాయవాదులు, జర్నలిస్టు సంఘం నాయకులు, సహచర జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

# అవినీతికి కేరాఫ్ ఇందూరు బల్దియా...

- కార్పొరేషన్ బడ్జెట్లో కోట్లు..పనులు మాత్రం శూన్యం..
- బల్దియాపై పోరు ఉద్యమంలో ఎమ్మెల్యే ధన్ పాల్ ఫైర్...
- ర్యాలీగా కార్పొరేషన్ కార్యాలయానికి ఎమ్మెల్యే..కార్పొరేటర్లు...
- కమిషనర్ తీరుపై అసహనం...
- తీవ్ర ఉద్రిక్తత..కార్యాలయం ముందు బైఠాయింపు..






**నిజామాబాద్ సెప్టెంబర్ 28: (తెలంగాణ వాణి ప్రతినిధి)**
అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా నిజామాబాద్ కార్పొరేషన్ మారిందని, ప్రతి బడ్జెట్ మీటింగ్ లో కోట్లు కేటాయిస్తారు కానీ పనుల కోసం రూపాయి ఖర్చు చేయడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. ఎమ్మెల్యేతో పాటు బీజేపీ కార్పొరేటర్లు సోమవారం నగరంలోని ధర్నా చౌక్లో బీజేపీ పోరు ఉద్యమం చేపట్టింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అభివృద్ధి కోసం ఒక ఎమ్మెల్యే గా ఉండి కూడా ధర్నా చేస్తున్నానంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కార్పొరేషన్లు 150 కోట్ల ఆదాయం, 94 కోట్ల మిగులు బడ్జెట్ ఉన్నా ఒక్క రూపాయి ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటున్నారు. పదేళ్లు బీఆర్ఎస్ పాలించినా..మేయర్ వాళ్లే ఉన్నా అభివృద్ధి చేయలేకపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తుందని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ అభివృద్ధి కొరకు 200 కోట్లు మంజూరు చేస్తామని చెప్పి ఇప్పటివరకు విడుదల చేయలేరన్నారు. ప్రభుత్వంలో ఉండి కూడా ఇక్కడి మేయర్ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు.నిజామాబాద్ ప్రజలకు నిధులు కాగితాలపై కనిపించడం అవసరం లేదు. ఆ నిధులతో చేసిన రోడ్డు కనిపించాలి, నిర్మించిన డ్రైనేజీలు కనిపించాలి, వెలిగే దీపాలు కనిపించాలన్నారు. కమిషనర్ కు అనేకసార్లు కలిసి లేఖలు అందించినా స్పందించకపోవడం తగదన్నారు. బడ్జెట్ లో డివిజన్ల అభివృద్ధి కొరకు 35 కోట్లు కేటాయించినా..ఇప్పటి వరకు ఒక్క డివిజన్ కు కూడా రూపాయి కేటాయించలేదన్నారు.
అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ... ఇందూరు అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ కలిసి నిధులు తీసుకొస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని పథకాల్లో కేంద్రం వాటా ఉందన్నారు. మాధవ నగర్ వంతెనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఇందూరు అభివృద్ధి కొరకు గెలిచిన ఎమ్మెల్యేకు నిధులు ఇవ్వకుండా ఓడిన షబ్బీర్లుకి మహేష్ కుమార్ గౌడ్కు పెత్తనం ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు.

**కార్పొరేషన్ ముట్టడి.... ఉద్రిక్తత....**
బల్దియా సమస్యల పరిష్కారానికి, కమిషనర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ధర్నాచౌక్ లో ధర్నా అనంతరం కార్పొరేషన్ కార్యాలయ ముట్టడికి బయలుదేరారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఎమ్మెల్యే, బిజెపి కార్పొరేటర్లు మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో ఎమ్మెల్యే ధన్ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ వచ్చే వరకు జరిగేది లేదని హెచ్చరించి బైఠాయించారు. అనంతరం కమిషనర్ దిలీప్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు 28 మంది, సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, ఆయా మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# టి.ఎస్.టి.టి.ఎఫ్ అశ్వారావుపేట మండల కమిటీ ఎన్నిక

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి)**
: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టి.ఎస్.టి.టి.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు రాములు నాయక్ డిమాండ్ చేశారు. ఎస్జీటీ ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని, జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



అనంతరం టి.ఎస్.టి.టి.ఎఫ్ అశ్వారావుపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా లకావత్ జేత్య, అధ్యక్షుడిగా జరుపుల జగ్గయ్య, ప్రధాన కార్యదర్శిగా మాలోత్ వెంకన్నబాబు, కోశాధికారిగా భూక్య నరసింహ, ఉపాధ్యక్షుడిగా కున్సోత్ గంగాధర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజావత్ బాలునాయక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బాలకృష్ణ చౌహాన్, రత్నాకర్, భూక్య శోభన్, భూక్య రాజు, మంగమ్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో రూ.84 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
దమ్మపేట మండలంలో సుమారు రూ.84 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొండివర్రె గ్రామంలో 'హలో శుభోదయం' కార్యక్రమంలో ప్రజలను కలిసి వారి సమస్యలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.జగ్గారంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం, రూ.10 లక్షలతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన చేసి, రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. కొడిసెలగూడెంలో రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, తాటిసుబ్బన్నగూడెంలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. పట్వారిగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అశ్వారావుపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# అశ్వారావుపేటలో నూతన బార్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

### అక్టోబర్ 12 వరకు గడువు..
### 16న కలెక్టర్ సమక్షంలో డ్రా

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలో నూతనంగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. 21 ఏళ్లు నిండిన అర్హులు నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దరఖాస్తుతో పాటు తిరిగి చెల్లించని రూ.లక్ష రుసుమును డీడీ లేదా చలాన్ రూపంలో, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ లేదా పాన్ కార్డు స్వీయ ధ్రువీకరణ ప్రతిని సమర్పించాలి. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన దరఖాస్తుదారుల్లో ఒకరిని అక్టోబర్ 16న ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.



## ప్రజావాణికి ఆరు దరఖాస్తులు



**తెలంగాణ వాణి కోరుట్ల రూరల్ సెప్టెంబర్ 28**
: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆరు దరఖాస్తులు అందినట్లు నోడల్ అధికారి రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మూడు రెవెన్యూ శాఖకు, ఒక్కొక్కటి ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలకు వచ్చినట్లు తెలిపారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో వోదెల రామకృష్ణ కోరారు. దరఖాస్తులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

## మన గోదావరి--మన బాధ్యత!

### గోదావరి స్వచ్ఛతలో డబ్ల్యూజేఐ పాత్రికేయుల భాగస్వామ్యం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
గోదావరి పరిరక్షణలో భాగంగా ఎన్టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో అంతర్గాం మండలం గోలివాడ పుష్కరఘాట్ వద్ద సోమవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ), అంతర్గాం--రామగుండం ప్రెస్ క్లబ్ పాత్రికేయులు పాల్గొని నది తీరంలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. సేకరించిన వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులు, గ్రామస్థులతో కలిసి పాత్రికేయులు స్వచ్ఛత కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ ఈడీ (ఆర్అండ్టీ) చందన్ కుమార్ సమంత పాత్రికేయుల సామాజిక బాధ్యతను అభినందించారు. గోదావరి మన జీవనాధారం.. దాని పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్యక్రమంలో సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంజాల రామస్వామి, కంపెల్లి మల్లికార్జున్ పల్లికొండ మధుకర్, పూసల రవి, తగురం కరుణాకర్ దాసరి విష్ణు కుమార్,శ్రీనివాస్ పటేల్,రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మదర్ డెయిరీ డైరెక్టర్‌గా చీర లావణ్య విజయం

**రాజపేట, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి విలేకరి):**



నల్లగొండ--రంగారెడ్డి జిల్లాల మదర్ డెయిరీ పాలకవర్గంలోని మూడు డైరెక్టర్ స్థానాలకు సోమవారం హయత్‌నగర్‌లో జరిగిన ఎన్నికల్లో రాజపేటకు చెందిన చీర లావణ్య మహిపాల్ విజయం సాధించారు. జనరల్ మహిళా కేటగిరీలో పోటీ చేసిన ఆమె 190 ఓట్లతో గెలుపొందారు. తన విజయానికి సహకరించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సొసైటీ చైర్మన్లు, పాల ఉత్పత్తిదారులకు కృతజ్ఞతలు తెలిపారు. పాడి రైతుల సంక్షేమం, పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. లావణ్య మహిపాల్ విజయంపై బీసీ నేత జూకంటి ప్రవీణ్, పారుపల్లి సర్పంచ్ మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాపోలు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు.

## పేదల చైతన్యం కోసమే జాషువా సాహిత్యం.



**హుస్నాబాద్ సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ఆర్ సి)**
బడుగుబలహీనవర్గాల జీవితంలో చైతన్యం నింపుట కోసమే గుర్రం జాషువాసాహిత్యాన్ని వినియోగించాడని కౌన్సిలర్ గాదెపాక రవీందర్ అన్నారు. కవికోకిల గుర్రం జాషువా 132వ, జయంతిసందర్భంగా జనజాగృతి కార్యాలయంలో ఆయనచిత్రపటానికి పూలమాలవేసి నివాళు లుఅర్పించారు.అనంతరం కౌన్సిలర్ గాదె రవీందర్ మాట్లాడుతూ నిమ్న జాతిలో పుట్టిన జాషువా కష్టపడి చదివి, సాహిత్య ఉపాసన చేసి, అద్భుతమైన కావ్యాలను రచించాడనిఅన్నారు. కష్టజీవుల కన్నీళ్లను తన కవితా వస్తువుగా మలచి, వారి బాధలు తీర్చుటకునిరంతరంఆలోచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనజాగృతి కళాసమితిఅధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్, జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, దళిత బహుజన సంఘాల నాయకులు వేల్పుల రాజు, బోధి శంకర్ దమ్మచారి, మెతుకు కొమురయ్య,అంబాలబిక్షపతి,అధ్యాపకులు అర్షంజనార్ధన్, దేవరకనకయ్య,బాలసాని దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల కళాశాలలో 'నషాముక్త్ భారత్ అభియాన్'




**హుస్నాబాద్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ఆర్‌సీ)**
హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం 'నషాముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. లలిత ఆధ్వర్యంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, వాటి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి. లలిత మాట్లాడుతూ విద్యార్థినులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పట్టుదలతో చదివి లక్ష్యాలను సాధించాలని సూచించారు. సమాజంలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్, మాదకద్రవ్యాల నిర్మూలన కన్వీనర్ టి. నిర్మలదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి. కర్ణాకర్ మాట్లాడుతూ విద్యార్థినులు మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఎంపికపై సందేహాలు

- అధికారిక పరిశీలన లేకుండానే జాబితాలు సిద్ధం చేస్తున్నారన్న ఆరోపణలు
- ప్రైవేట్ వ్యక్తుల చేతికి లబ్ధిదారుల వివరాలు ఎలా చేరాయంటున్న ప్రజలు

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి మమత రెడ్డి)**
పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై కూకట్‌పల్లి నియోజకవర్గంలో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగడం లేదని కొందరు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తికాకుండానే జాబితాలు సిద్ధమవుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
అధికారికంగా పరిశీలించాల్సిన దరఖాస్తుదారుల వివరాలు, అర్హతకు సంబంధించిన రికార్డులు ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఎలా చేరాయనే అంశంపైనా ప్రజలు స్పష్టత కోరుతున్నారు. ఎంపిక





ప్రక్రియలో ప్రైవేట్ వ్యక్తుల పాత్రకు అధికారిక అనుమతి ఉందా? ఉంటే ఎవరు బాధ్యతలు అప్పగించారు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### అధికారులే స్పష్టత ఇవ్వాలి

క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ఎవరు నిర్వహించారు, దానికి సంబంధించిన నివేదికలు ఉన్నాయా, ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచుతారా అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. అలాగే పరిశీలన జరగలేదని భావిస్తున్న అర్హులైన పేదల దరఖాస్తులను మరోసారి పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయంపై వస్తున్న ఆరోపణలపై సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

**వేములవాడ, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తూ అండగా నిలవాలని సూచించారు. సంఘం పరిధిలోని 22 గ్రామాల రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కొండ రాజశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,



రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కరుణాకర్, పీఏసీఎస్ కార్యదర్శి, అధికారులు, రైతు సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**శంకరపట్నం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణ ఆధ్వర్యంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ పూదరి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లులు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్వైజర్ అరుణ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు సమతుల్య పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. పోషకాహార లోపం నివారణకు అంగన్వాడీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నర్సమ్మ, అంగన్వాడీ టీచర్లు పద్మ, స్వరూప, శోభ, ఆశా కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## ఎరువుల అక్రమాలపై కొరడా

**తిమ్మాపూర్‌లో వ్యవసాయ అధికారుల ఆకస్మిక తనిఖీలు**

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తిమ్మాపూర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయశాఖ అధికారులు, స్థానిక పోలీసుల సహకారంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ సంచాలకుడి ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో ఎరువుల నిల్వలు, నాణ్యత, విక్రయాలు, రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా జేడీఏ చతుర్‌నాయక్ మాట్లాడుతూ ప్రతి విక్రయానికి రైతులకు బిల్లు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎరువుల లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అధీకృత హోల్‌సేల్ డీలర్ల నుంచే



ఎరువులు కొనుగోలు చేసి విక్రయించాలని సూచించారు. తనిఖీల్లో ఏడీఏ మానకొండూరు ఎన్. శ్రీధర్, ఎస్ఐ అన్వర్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**ఓటర్ల జాబితాపై స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు అంశాలపై కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న అభ్యంతరాల నేపథ్యంలో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణలో జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ నిర్వహించిన నిరసనల్లో ఇదీ భాగమని వార్తా నివేదికలు పేర్కొన్నాయి. జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించబడేలా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలని అన్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి తాము లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కోరారు. 'ఓటు చోరీ'పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై సమగ్ర పరిశీలన జరపాలని, ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, డేటా నిర్వహణకు సంబంధించిన వివరాలను ప్రజలకు వెల్లడించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## సీఈఐఆర్ పోర్టల్‌తో పోయిన ఐదు మొబైళ్ల రికవరీ

**జమ్మికుంట, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జమ్మికుంట పట్టణ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి రికవరీ చేశారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఈఐఆర్ ఆపరేటర్ కానిస్టేబుల్ సౌమ్య ప్రత్యేకంగా కృషి చేశారు. రికవరీ చేసిన ఫోన్లను సోమవారం యజమానులు కొమ్ము ప్రేమ్‌కుమార్, ఎండీ రియాజుద్దీన్, గాదె రాములు, ఎండీ సాదిక్, యాద వెంకటాచలంలకు పోలీసులు అప్పగించారు. ఫోన్లు తిరిగి అందించడంపై బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ పోయిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

### డీలర్లకు వ్యవసాయ అధికారి సూచనలు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎరువుల విక్రయ కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఎరువుల భౌతిక నిల్వలు, ఈ-పాస్ నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులను పరిశీలించారు.
ప్రతి విక్రయాన్ని తప్పనిసరిగా ఈ-పాస్‌లో నమోదు చేసి, నిబంధనల ప్రకారం బిల్లు జారీ చేయాలని డీలర్లకు సూచించారు. అధీకృత ఎరువులనే విక్రయించాలని, స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, ఇతర రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా అందేలా డీలర్లు నిబంధనలు పాటించాలని సూచించారు.

## భగత్‌సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలి



**హుస్నాబాద్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ఆర్‌సి)**
అఖిల భారత యువజన సమాఖ్య హుస్నాబాద్ మండల సమితి ఆధ్వర్యంలో అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో షహీద్ భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు దొంతరబోయిన రజిత, కార్యదర్శి జాగీర్ సాయి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనివాస్, గొర్ల రాజు యాదవ్, గుగులోతు శ్రీకాంత్ నాయక్, బానోత్ శ్రీనివాస్, సంపత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్యనటుడు డాక్టర్ వేణుమాధవ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**జమ్మికుంట, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రముఖ హాస్యనటుడు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ వేణుమాధవ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జమ్మికుంటలో అభిమానులు, మిత్రులు ఘనంగా నివాళు లర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సినీ రంగానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. తనదైన హాస్యంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వేణుమాధవ్ జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన బామ్మర్దులు మోహన్, వేణుగోపాల్, మిత్రులు దొడ్డే రవీందర్, దొడ్డే భాస్కర్, వద్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు

## సింగీతంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**రాయికోడ్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాయికోడ్ మండలం సింగీతం గ్రామంలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఇద్దరు లబ్ధిదారులకు రూ.72,500 విలువైన చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశాల మేరకు రఫీక్, తలారి మోహన్‌లకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు కష్టకాలంలో అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాలాజీ నర్సింలు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో నూతన 'ఆశ్రయ్' కేంద్రం ప్రారంభం



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి విలేకరి)**
కొండాపూర్‌లో తెలంగాణ ప్రభుత్వం--అమెజాన్ ఇండియా భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన నూతన 'ఆశ్రయ్' కేంద్రాన్ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజన ఐఏఎస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి ఐఏఎస్ ప్రారంభించారు. డెలివరీ, గిగ్ వర్కర్ల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని అన్ని ప్లాట్‌ఫామ్‌లకు చెందిన డెలివరీ భాగస్వాములు ఉచితంగా వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఏసీ విశ్రాంతి గది, సీటింగ్, మొబైల్ ఛార్జింగ్, ఉచిత వైఫై, తాగునీరు, వాష్‌రూమ్, ప్రథమ చికిత్స వంటి సదుపాయాలు కల్పించారు. కొండాపూర్‌తో పాటు తెల్లాపూర్, పటాన్‌చెరు, భారతీనగర్, చందానగర్ ప్రాంతాల్లో కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయడంతో సైబరాబాద్ పరిధిలో ఆశ్రయ్ కేంద్రాల సంఖ్య 14కు చేరిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, అమెజాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేశవపట్నం హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

### విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి



**శంకరపట్నం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
కేశవపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవా సమితి--హుజూరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే తమ హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధం, వేధింపులు, బుల్లీయింగ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దేవయ్య, నరసింహస్వామి, అనిల్, ప్రధానోపాధ్యాయులు సుభాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒంటిపై పెట్రోల్ పోసుకుని వృద్ధుడి ఆత్మహత్య

**ధర్మారం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**



మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన జుంజుపల్లి నారాయణ (60) సోమవారం ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒంటరితనం, అనారోగ్యంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో కాలికి గాయం కావడంతో శస్త్రచికిత్స జరగగా, చూసుకునే వారు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎంబడి శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చిగురుమామిడిలో ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



**చిగురుమామిడి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి విలేఖరి):**
చిగురుమామిడి మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి బి. చత్రు నాయక్, ఎస్సై జగదీశ్వర్, మండల వ్యవసాయ అధికారి తాటిపెల్లి పున్నంచందర్ రెడ్డి సంయుక్తంగా ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అనుమతించిన నాణ్యమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని, నకిలీ లేదా అనుమతి లేని ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చత్రు నాయక్ హెచ్చరించారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని, ప్రభుత్వ వ్యవసాయ పథకాలతో పాటు భవిష్యత్ వడ్ల కొనుగోళ్లలోనూ ఇది కీలకమని తెలిపారు. కార్యక్రమంలో ఎరువుల దుకాణదారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రాజేశం గౌడ్‌ను పరామర్శించిన మూల శ్రీనివాస్ గౌడ్

**జగిత్యాల/బుగ్గారం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**



మాజీ మంత్రి, తెలంగాణ తొలి ఆర్థిక సంఘం చైర్మన్ జి. రాజేశం గౌడ్ ఇటీవల మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న బుగ్గారం మండల గౌడ సంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మూల శ్రీనివాస్ గౌడ్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

## విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి

**పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు: సీఎస్**
**కరీంనగర్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యా, సంక్షేమ అంశాలపై కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల హాజరు, భోజనం, పారిశుద్ధ్యం, ఉపాధ్యాయుల పనితీరు, మౌలిక వసతులను నిరంతరం పర్యవేక్షించాలని, కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ చిత్రా మిశ్రా జిల్లా అధికారులతో సమీక్షించి విద్యార్థుల విద్య, భద్రత, భోజనం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## చేనేత కార్మికుల సంక్షేమానికి పలు డిమాండ్లు

**60 ఏళ్లు దాటిన కార్మికులకూ రూ.5 లక్షల బీమా కల్పించాలి**
**శంకరపట్నం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**



శంకరపట్నం మండలం ఆముదాలపల్లిలో చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం ఆధ్వర్యంలో 52వ వార్షిక, 66వ సాధారణ మహాసభను సోమవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వెల్దండి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చేనేత కార్మికుల సంక్షేమంపై పలు తీర్మానాలు చేశారు. 60 ఏళ్లు దాటిన అర్హత కలిగిన చేనేత కార్మికులకు కూడా రూ.5 లక్షల బీమా వర్తింపజేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ ఇన్సెంటివ్‌లు, 20 శాతం రిబేట్, ఇతర బకాయిలను విడుదల చేయాలని, సహకార సంఘాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. వృద్ధాప్య పెన్షన్, వర్క్‌షెడ్ పథకం పునరుద్ధరణ, ఆప్కోకు పాలకవర్గం ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ సహాయ అభివృద్ధి అధికారి పి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చందాపట్ల జనార్ధన్, డైరెక్టర్లు బైరి శ్రీనివాస్, బైరి రాజు, బడుగు దామోదర్, బడుగు విజయ, మంజన సరోజన, దూస శంకరయ్య, కోశాధికారి వేముల రామచంద్రం, మేనేజర్ వెంకటరాజు, సిబ్బంది, సంఘ సభ్యులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు భద్రతా కవచం

- కలెక్టరేట్, హెలిప్యాడ్, పరిసరాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన
- కలెక్టర్, సీపీ, సీఎం భద్రతా అధికారుల సమీక్ష
- సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశం

**కరీంనగర్, సెప్టెంబర్ 28, (తెలంగాణ వాణి)**



నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ నెల 30న కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సీఎం భద్రతా అధికారులు నూతన కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలించారు.

**ముందుగా క్షేత్రస్థాయి పరిశీలన**

కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిప్యాడ్, తెలంగాణ తల్లి విగ్రహం, నూతన కలెక్టరేట్ భవనం, సమావేశ మందిరం, జిల్లా కలెక్టర్ నూతన చాంబర్, పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ సిపి, సీఎం భద్రతా అధికారులు పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక, కార్యక్రమాల నిర్వహణ, కాన్వాయ్ రాకపోకలు, తిరుగు ప్రయాణం వరకు చేపట్టాల్సిన భద్రతా చర్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రత, ప్రోటోకాల్, ఇతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

**ఏ ఎస్ ఎల్ సమావేశంలో సమగ్ర సమీక్ష**

ముఖ్యమంత్రి పర్యటనకు ముందు నిర్వహించే అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ (ఏ ఎస్ ఎల్) సమీక్షలో భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు, హెలిప్యాడ్, సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ప్రోటోకాల్ తదితర అంశాలను సమీక్షించారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.

**పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి: జిల్లా కలెక్టర్**

సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమన్వయంతో తూచా తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. నిర్దిష్ట సమయంలోగా ఏర్పాట్లను పూర్తి చేసి, ప్రతి అంశాన్ని పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు, నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ప్రత్యేకంగా రోడ్లు--భవనాలు, అటవీ, విద్యుత్, ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

**పటిష్ట బందోబస్తు: సీపీ**

పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెలిప్యాడ్ వద్ద సీఎం స్వాగతం నుంచి తిరిగి హెలికాప్టర్ బయలుదేరే వరకు ప్రతి దశలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సీఎం కాన్వాయ్, గౌరవ వందనం, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. విధులు కేటాయించిన రోప్ సిబ్బంది, రూట్ అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో ఉండాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో భారీ కేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పోలీసు సిబ్బందికి సహకరిస్తూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, సీఎంవో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ అధికారులు ఎస్పీ రామచందర్‌రావు, డీఎస్పీలు దుర్శేటి రఘు చందర్, శ్యామ్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.






## నకిలీ ఎరువుల విక్రయాలపై ఉక్కుపాదం

**శంకరపట్నం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**



మండలంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ, పోలీసు అధికారులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎన్‌పీకే మిక్సర్ల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు--విక్రయ వివరాలు, బిల్లులు, లైసెన్సులు, అనుమతి పత్రాలను పరిశీలించారు. నకిలీ, అనుమతి లేని ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో మానకొండూర్ ఏడీఏ శ్రీధర్, ఏఓ వెంకటేష్, హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ సంపత్ పాల్గొన్నారు.

## 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమంలో కార్పొరేటర్ రజిని రవి



**పెద్దపల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం 29వ డివిజన్ లింగాపూర్‌లో నిర్వహించిన 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి మహిళలతో కలిసి పాల్గొన్నారు. మహిళల్లో అక్షరాస్యత, విద్యపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గంగారపు వనజ, సిరిపురం భారతి, మహిళలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన విద్యార్థి



**ధర్మారం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి )**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న సంపతి రక్షిత రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో అండర్ 18 బాలికల డిస్కస్ త్రో రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం సాధించి కాంస్య పతకాన్ని పొందినట్లు ప్రిన్సిపల్ ఈరవేణి రాజకుమార్ తెలిపారు. ఈనెల 26 నుండి 27 వరకు హనుమకొండలో జరిగిన 12వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ పోటీలలో పాల్గొని మూడవ స్థానం సాధించడం జరిగిందని రాజ్ కుమార్ తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమరయ్య మేకల సంజీవరావు ఆమెను అభినందించారు.

## వెంకటేశ్వర వైన్స్‌పై చర్యలు తీసుకోవాలి

### ప్రజావాణిలో కౌన్సిలర్ మంద రాధ ఫిర్యాదు






**జమ్మికుంట, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట మున్సిపాలిటీ 22వ వార్డులోని కేరళ స్కూల్ సమీపంలో ఉన్న వెంకటేశ్వర వైన్స్‌పై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ మంద రాధ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వైన్స్ పరిసరాల్లో అపరిశుభ్రత, మూత్రశాలల నిర్వహణ సరిగా లేకపోవడంతో దుర్వాసనతో ప్రజలు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలకు సమీపంలో వైన్స్ ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వైన్స్‌ను అక్కడి నుంచి తరలించాలని ఆమె కోరారు.

## సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్‌కు స్వర్ణానంది అవార్డు



**చిగురుమామిడి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్‌కు స్వర్ణానంది అవార్డు లభించింది. మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకురాలు పి. శిరీష రెడ్డి నేతృత్వంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. 26 ఏళ్లుగా సామాజిక సేవలు, యువతకు నైపుణ్య శిక్షణ, నిరుపేదలకు వైద్య సహాయం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినందుకు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, రిటైర్డ్ ఐపీఎస్ రత్న, సినీ నటుడు గౌతమ్ రాజు, సినీ దర్శకులు చెన్నివెల్లి మణికుమార్, వేణు తదితరులు పాల్గొని శ్రీనివాస్‌ను అభినందించారు.

## 14వ రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్



**నల్గొండ, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఆదివారం 14వ రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. ఎస్ఎస్‌కే సుమన్ కప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా సుమన్ తల్వార్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

## ఎండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి




**ఎండపల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి)**
మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ డి. కృపాకర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి మూడు దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెండు రెవెన్యూ, ఒకటి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవిగా అధికారులు తెలిపారు. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ అన్వేష్, ఏఓ కే. మహేష్, పశువైద్యాధికారి డాక్టర్ మనోజ్ కుమార్, ఎంఈఓ సహాయకుడు బి. కిషోర్ కుమార్, పీహెచ్‌సీ ప్రతినిధి శ్రీనివాస్, సీడీపీఓ యం. ఆండాలు, ఎస్సీ సంక్షేమ అధికారి మహమ్మద్ అఫ్సర్, హౌసింగ్ ఏఈ ఎస్. గౌతమి, అటవీ అధికారి ఇ. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెరుకుపల్లిలో ఘనంగా పోషణ్ మాసం




**గుండ్లపల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండలం చెరుకుపల్లి గ్రామంలో సోమవారం పోషణ్ మాసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిండి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం. రేణుక రెడ్డి పాల్గొని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న ఆరోగ్య లక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషకాహారంతో ఐరన్, కాల్షియం లోపాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి చిరంజీవులు, ఉపసర్పంచ్ బొడ్డు చిట్టెమ్మ, పాండు, అంగన్‌వాడీ టీచర్ పార్వతమ్మ, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులు, కిశోర బాలికలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పల్లె ఉత్పత్తులకు పట్టణంలో పట్టు



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కరీంనగర్ రెవెన్యూ గార్డెన్స్‌లో గ్రామ భారతి ఆధ్వర్యంలో సోమవారం 'శాతవాహన గ్రామీణ సంత' ప్రారంభమైంది. 40 స్టాళ్లలో చేనేత వస్త్రాలు, సేంద్రియ ఆహార పదార్థాలు, మట్టి పాత్రలు, హస్తకళలు, మూలికా ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ముఖ్య అతిథి పెండ్యాల కేశవరెడ్డి, ప్రధాన వక్త డాక్టర్ విక్రమ్ సింగ్ ఠాకూర్ అన్నారు. కార్యక్రమంలో జిన్నా సత్యనారాయణరెడ్డి, ఎన్. శంకరయ్య, డాక్టర్ గాలి పెల్లి నాగేశ్వర్, కూర్మాచలం మునిందర్, క్యాస మధు, గొల్లె తిరుపతి, శివనాథుల స్వప్న, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం గ్రీవెన్స్ లో వచ్చినవి తొమ్మిది దరఖాస్తులు



**రాజాపేట సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి విలేఖరి )**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ కూడా పాల్గొన్నారు. వివిధ శాఖలకు వచ్చినవి 9 దరఖాస్తులు అని ఎంపీ ఓ ఆవుల కిషన్ తెలిపారు. నోడల్ అధికారి నాగవేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ కు ఒక దరఖాస్తు, మండల రెవెన్యూ అధికారికి ఆరు దరఖాస్తులు, మండల అభివృద్ధి అధికారికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులు పరిశీల నిమిత్తం వివిధ శాఖలకు పంపినట్లు సూపరిండెంట్ అల్లం ఇన్నారెడ్డి తెలిపారు.

# అర్హులందరికీ ఉచితంగా 6 కిలోల సన్నబియ్యం

**రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డులు.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం మిర్యాలగూడలోని ఎస్‌వీ గార్డెన్స్‌లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల రేషన్ కార్డులు ఉండగా, 3.48 కోట్ల మంది లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 1,00,526 స్మార్ట్ రేషన్ కార్డులు ఉన్నాయని, సుమారు 2.98 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పంటలను కాపాడడంతో పాటు తాగునీటికి ప్రాధాన్యం ఇస్తున్నామని, పెండింగ్ ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 2028 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సుధ, ఆర్డీవో రమణారెడ్డి, పౌరసరఫరాల డీఎం రాంపతి నాయక్, డీఎస్ఓ



వెంకటేష్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి కౌన్సిలర్ పొనగంటి రాము అండ



**జమ్మికుంట, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మోత్కులగూడెంకు చెందిన బలభద్ర రామారావు అనారోగ్య సమస్యలతో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న 9వ వార్డు కౌన్సిలర్ పొనగంటి రాము వెంటనే స్పందించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలకు అయ్యే ఖర్చులను స్వయంగా భరించి, బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.

## ఏడాది దాటినా పూర్తికాని ఇందిరమ్మ మోడల్ హౌస్




**నారాయణఖేడ్/నాగలిగిద్ద, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగలిగిద్ద మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ఏడాది దాటినా పూర్తికాకపోవడంపై కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గణపతి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నిర్మాణంలో జాప్యంపై విచారణ జరిపి, పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరుతూ వినతిపత్రం అందజేశారు. అధికారులు నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతోనే పనులు ఆలస్యమవుతున్నాయని ఆయన ఆరోపించారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**నల్లగొండ, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు అంశాలపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్ గౌడ్ సూచన మేరకు డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు. ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్‌కు సంబంధించి కాంగ్రెస్ లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని అన్నారు. ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఎన్నికల సంఘం అధికారిక సమాచారం ప్రకారం జ్ఞానేశ్ కుమార్ ప్రస్తుతం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారు; ఎస్ఐఆర్-2026కు సంబంధించిన అధికారిక సేవలు కూడా ఈసీఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.




## భగత్‌సింగ్ ఆశయ సాధనకు పోరాడాలి

**డిండి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండలంలోని సీపీఐ ప్రజాభవన్‌లో షాహిద్ భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాంపల్లి ప్రవీణ్, ఎల్మినేటి నరేష్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం నిరంతరం పోరాడతామని తెలిపారు. భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు కోసం పోరాటాలు కొనసాగిస్తామని, యువత అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షులు జంగిలి కొండల్, అరుణ్, చింటూ, జంగయ్య, తిర్పత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంస్కార్ విద్యాలయంలో వృక్ష రక్షాబంధన్



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 28, (తెలంగాణ వాణి):**
ప్రకృతి వందన్ సంకల్ప దివస్ సందర్భంగా పెద్ద శంకరంపేట లోని సంస్కార్ విద్యాలయంలో విద్యార్థులు సోమవారం వృక్ష రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వృక్షాలకు మంగళ హారతులతో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు, కంకణాలు కట్టారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో



పాటు వాటిని సంరక్షించుకోవాలని పలువురు పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడు కోవడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. నీటిని పొదుపుగా వాడాలని. మొక్కలు నాటాలని. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించాలని వివరించారు. పాఠశాల ఎస్ జి సి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రకృతి సంకల్ప దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సీతారామారావు, ప్రిన్సిపల్ కవిత, ఎస్ జి సి ఇంచార్జ్ హైమావతి, జిల్లా పర్యావరణ ప్రముఖ రవి వర్మ, ఖండ పర్యావరణ ప్రముఖ శైలేష్., సతీష్ గౌడ్, సంతోష్ కుమార్, యశోధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌కు ఘన నివాళులు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా కిసాన్ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం వీఆర్వో కార్యాలయంలో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాపై అధికారులతో చర్చించి, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా, అర్హుల ఓట్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి, బీరంగూడ అధ్యక్షుడు ఈర్ల రాజు, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, మాణిక్ రెడ్డి, జగన్, సాయి ప్రసాద్, మురళి, ప్రసాద్‌తో పాటు వివిధ డివిజన్ అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## గోదావరి పరిరక్షణకు ఎన్టీపీసీ శుభ్రతా డ్రైవ్

**పెద్దపల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
గోదావరి నది పరిరక్షణలో భాగంగా రామగుండం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో గోలివాడ పుష్కరఘాట్ వద్ద సోమవారం భారీ శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీపీసీ ఈడీ (ఆర్అండ్‌టీ) చందన్ కుమార్ సమంత కార్యక్రమాన్ని ప్రారంభించారు. నది తీరంలోని ప్లాస్టిక్, చెత్తాచెదారం, వినాయక నిమజ్జన వ్యర్థాలను తొలగించి రీసైక్లింగ్‌కు తరలించారు. గ్రామ పంచాయతీలకు తడి, పొడి చెత్త కోసం డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందన్ కుమార్ సమంత మాట్లాడుతూ గోదావరి పరిశుభ్రత నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కొలిపాక చంద్రారెడ్డి, దారవేణి జ్యోతి పరమేశ్వర్, నాయకులు కోల రామ్మూర్తిగౌడ్, ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎంబేరు మన్నారు స్వామి ఆలయ అభివృద్ధికి కృషి: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



**కొమురవెల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కిష్టంపేట శివారులోని ఎంబేరు మన్నారు స్వామి దేవాలయ పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జనగామ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధితో పాటు కిష్టంపేట, బండగుట్ట నుంచి దేవాలయం వరకు రహదారుల మరమ్మతులకు కృషి చేస్తానన్నారు. దేవస్థానం భూములు ఆక్రమణకు గురైతే వాటిని తిరిగి స్వాధీనం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన పాలకమండలి చైర్మన్‌గా జొర్రీగల మల్లారెడ్డి, సభ్యులుగా పెద్దకుల కనకయ్య, ఆకుల సత్తయ్య, లింగమల్లి వెంకటయ్య, మాదాసు స్వప్న ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మహదేవుని శ్రీనివాస్, మంజ మల్లేశం, దాసరి శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి, మెరుగు కృష్ణ, పంజల జ్యోతి మల్లేశం పాల్గొన్నారు.

## కాంతమ్మ కుటుంబాన్ని పరామర్శించిన వొడితల ప్రణవ్



**వీణవంక, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: వీణవంక మండలం ఘన్ముక్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జున్నుతుల మల్లారెడ్డి తల్లి కాంతమ్మ ఇటీవల మృతి చెందడంతో హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు ఉన్నారు.

## ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మ దహనం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం మజీద్ కార్నర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ముస్తఫా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించవద్దని, ఓటు హక్కును కాపాడాలని నాయకులు నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని ముస్తఫా, హరిప్రసాద్ తెలిపారు. ఎన్నికల సంఘం ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు అధికారికంగా పేర్కొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ఈసంపెల్లి అంజుల్, సిరిశెట్టి సతీష్, దారంగుల కుమార్, డివిజన్ అధ్యక్షులు, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## మొబైల్ రోబోట్లపై గీతం విద్యార్థులకు శిక్షణ



**పటాన్ చెరు, సెప్టెంబర్ 28, (తెలంగాణ వాణి);**
రోబోటిక్స్, ఆటోమేషన్ లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల పై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించేందుకు, గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ హైదరాబాదులోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం స్వయం ప్రతిపత్తి గల మొబైల్ రోబోట్ల పై రెండు రోజుల స్వీయ అనుభవం గడించే కార్యశాల ను విజయవంతంగా నిర్వహించింది. ఈ వర్క్షాపులో సుమారు 70 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ముఖాముఖి శిక్షణతో పాటు ఆచరణాత్మక ప్రదర్శనల ద్వారా విలువైన అనుభవాన్ని పొందారు. ఆసక్తికరమైన చర్చలు, ప్రశ్న-జవాబు కార్యక్రమాల ద్వారా, స్వయం ప్రతిపత్తి గల మొబైల్ రోబోటిక్స్ పై తమ అవగాహనను మరింత పెంచుకోవడానికి, అలాగే తమ సాంకేతిక సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఈ కార్యశాలలో పాల్గొన్న వారికి అవకాశం లభించింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న రోబోటిక్స్, ఆటోమేషన్ రంగంలో ఇది విలువైన అంతర్దృష్టులను అందించిందని పేర్కొంటూ, ఇందులో పాల్గొన్నవారు ఈ కార్యశాల యొక్క ఆచరణాత్మక, పరిశ్రమకు సంబంధించిన విధానాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలు తమ కెరీర్ అవకాశాలను విస్తృతం చేసుకోవడానికి, ఈ రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకోవడానికి సహాయపడతాయని కూడా వారు తెలిపారు.

## ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ నిరసన

### సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్



**హనుమకొండ, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి స్టాఫ్ రిపోర్టర్):**
ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా హనుమకొండలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం సీఈసీ జ్ఞానేశ్కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్పై కాంగ్రెస్ నిరసనలు నిర్వహించినట్లు తాజా నివేదికలు కూడా పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా పారదర్శకత పాటించాలని కోరారు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజేందర్రెడ్డి, ప్రకాశ్రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వెంకట్రామ్రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాబార్డ్ సహకారంతో భానుపురి డైరీ అభివృద్ధి




**చిలుకూరు, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
నాబార్డ్ సహకారంతో భానుపురి రైతు ఉత్పత్తిదారుల సంస్థ డైరీని అభివృద్ధి చేసుకోవాలని నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ బాంబర్ సూచించారు. సోమవారం భానుపురి ఎఫ్పీఓ కార్యాలయాన్ని సందర్శించి డైరెక్టర్లతో సమావేశమయ్యారు. ఐదేళ్లపాటు నాబార్డ్ సహకారం అందిస్తుందని, అనంతరం సంస్థ స్వయం సమృద్ధి సాధించేలా వ్యాపార, సేవా కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. నాబార్డ్ సూర్యాపేట జిల్లా అభివృద్ధి మేనేజర్ రవీంద్ర నాయక్, మండల పశువైద్యాధికారి వీరారెడ్డి తమ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు వాడపల్లి రమేష్, ఎఫ్పీఓ సీఈఓ నంద్యాల అఖిల్, చైర్మన్ కే. రాము నాగేశ్వరరావు, రమణ, సతీష్, శిరీష, ప్రభాకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసులకు పదోన్నతులు



**వనపర్తి : సెప్టెంబర్ 28, (తెలంగాణ వాణి ప్రతినిధి )**
వనపర్తి జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి చేతుల మీదుగా పదోన్నతులు కల్పించారు.ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకట నాగరాజు ఎస్సైగా, అదేవిధంగా హెడ్ కానిస్టేబుల్స్గా విధులు నిర్వహిస్తున్న రాజేందర్ రెడ్డి, బాలీశ్వర్ రెడ్డి ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, పదోన్నతి పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. పదోన్నతులు పొందడం ఆనందదాయకమని, పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి, ప్రజలకు తగిన న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ వనపర్తి జిల్లా పోలీస్ శాఖకు, తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఏఐ-ఆధారిత ఫార్మకోవిజిలెన్స్పై శిక్షణ

**ఐఐటీ హైదరాబాదు నిపుణులతో గీతం ఫార్మసీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి**




**పటాన్ చెరు, సెప్టెంబర్ 28, (తెలంగాణ రాష్ట్ర):**
ఫార్మాస్యూటికల్ భద్రత, నియంత్రణ వ్యవహారాలు, నియమ పాలనలో కృత్రిమ మేధస్సు (ఏఐ) యొక్క అభివృద్ధి చెందుతున్న అనువర్తనాలపై దృష్టి సారిస్తూ, మేక్ఇంటర్న్, ఇ-సెల్, ఐఐటీ హైదరాబాదు నిపుణులతో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు సెప్టెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఫార్మకోవిజిలెన్స్, ఫార్మాస్యూటికల్ క్వాలిటీ సిస్టమ్స్, రెగ్యులేటరీ సైన్స్ రంగాలలో పనిచేసే మహమ్మద్ హాషీమ్ ఈ కార్యక్రమంలో ప్రధాన శిక్షకుడి గా వ్యవహరిస్తున్నారు.
'ఏఐ-ఆధారిత ఫార్మకోవిజిలెన్స్, వాస్తవ ప్రపంచ ఔషధ భద్రతా విశ్లేషణలు', 'ప్రపంచ నియంత్రణ నిఘా, ఏఐ-ఆధారిత నియమపాలన' అనే రెండు కీలక అంశాలపై విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఫార్మకోవిజిలెన్స్, వాస్తవ ప్రపంచ ఔషధ భద్రత, నియంత్రిత నిఘా, ఫార్మాస్యూటికల్ నియమ పాలనలో ఏఐ, డేటా-ఆధారిత సాంకేతికతల యొక్క అభివృద్ధి చెందుతున్న పాత్రపై విద్యార్థులకు ఆచరణాత్మక అంతర్దృష్టులను అందించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.
నిపుణులతో నిర్వహించే ఈ శిక్షణ, పరిశ్రమ-ఆధారిత అభ్యాసం ద్వారా, సమకాలీన నియంత్రణ పద్ధతులపై విద్యార్థుల అవగాహనను పెంపొందించడం, వేగంగా మారుతున్న ఫార్మాస్యూటికల్, ఆరోగ్య సంరక్షణ రంగానికి సంబంధించిన నైపుణ్యాలను వారికి అందించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. విద్యను అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ అవసరాలతో అనుసంధానించడానికి, అలాగే ఫార్మాస్యూటికల్ సాంకేతికత, నియంత్రణ వ్యవహారాలు, ఏఐ-ఆధారిత ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలలో విద్యార్థులలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి వీలు కల్పిస్తున్నారు.
ఈ మూడు రోజుల కార్యక్రమం, ఔషధ భద్రత, ప్రపంచ నియంత్రణ నియమ పాలన, భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ప్రస్తుత పోకడలు, సాంకేతికతలు, ఆచరణాత్మక విధానాలతో మమేకమవ్వడానికి గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు ఐఐటీ నిపుణులతో ఒక అవకాశాన్ని అందిస్తోంది.

## భూ రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలి

**భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం: మంత్రి పొంగులేటి**




**వనపర్తి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అధికారులను ఆదేశించారు. వనపర్తి ఐడీఓసీ సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా రెవెన్యూ, రీసర్వే, గృహ నిర్మాణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సుమారు 120 ఏళ్ల తర్వాత భూముల రీసర్వే జరుగుతున్నందున అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. నవంబర్ 15లోపు ప్రక్రియ పూర్తి చేయాలని, నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.
సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్రెడ్డి, తూడి మేఘారెడ్డి, అనిరుధ్రెడ్డి, బండ్ల కృష్ణమోహన్రెడ్డి, జి.మధుసూదన్రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, కూచుకుళ్ల దామోదర్రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, కలెక్టర్లు ఆదర్శ్ సురభి, రిజ్వాన్ భాషా షేక్, హేమంత్ కేశవ్ పాటిల్, సీహెచ్ ప్రియాంక, కుష్బూ గుప్తా తదితరులు హాజరయ్యారు. అనంతరం శ్రీరంగాపురం, ఆత్మకూరు, వీపనగండ్ల, చిన్నంబావి తహసీల్దార్ కార్యాలయాలు, వనపర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలకు మంత్రులు శంకుస్థాపన చేశారు.

## ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ నిరసన

**సీఈసీ జ్ఞానేశ్కుమార్పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**వనపర్తి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):ల**
ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితా అంశాలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి సమీకృత కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టిన నిరసనల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా శివసేనరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్పై కాంగ్రెస్ లేవనెత్తుతున్న అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మేఘారెడ్డి సీఈసీ జ్ఞానేశ్కుమార్పై కాంగ్రెస్ చేసిన ఆరోపణలు, ఆయనపై చర్యలు తీసుకోవాలన్న పార్టీ డిమాండ్ను వ్యక్తం చేశారు. జ్ఞానేశ్కుమార్ ప్రస్తుతం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్గా ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారిక సమాచారం పేర్కొంటోంది.
కార్యక్రమంలో తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్పర్సన్ కొల్లే సరిత తిరుపతయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, ధనలక్ష్మి, సాయి చరణ్రెడ్డి, జనార్దన్సాగర్, కోళ్ల వెంకటేష్, బి.కృష్ణ, మున్సిపల్ చైర్మన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్గౌడ్, సత్యశిలారెడ్డి, నక్క రవికిరణ్, రాములు, రామ్రెడ్డి, నరహరి, కృష్ణయాదవ్, దయాకర్రెడ్డి, విష్ణు ముదిరాజ్, కౌన్సిలర్లు మహేశ్వరి, విజయలక్ష్మి, యువజన కాంగ్రెస్ నాయకులు పాండు సాగర్, శివకుమార్ నాయుడు, యాదగిరి, అరవింద్ నాయక్, తిరుపతి నాయక్, మాజీ ఎంపీపీ శంకర్నాయక్, కోట్ల రవి, అయూబ్ఖాన్, రాజ్కుమార్, శ్రీలతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో విద్యార్థుల్లో ప్రతిభకు పదును.

**హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.**




**హనుమకొండ సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి టౌన్)**
హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హనుమకొండ జిల్లా స్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ను కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.జిల్లా స్థాయి ఎంపికలు, పోటీల్లో భాగంగా వివిధ క్రీడాంశాల్లో సుమారు 2,000 మంది విద్యార్థి క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ ఆధారంగా ఎంపికైన క్రీడాకారులు తదుపరి స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందనున్నారు.క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాల్గొన్న క్రీడాకారులందరికీ భోజన వసతితో పాటు మంచినీటి సౌకర్యాన్ని ప్రత్యేకంగా కల్పించారు.

## టెండర్లు పూర్తయిన అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలి



**హసన్పర్తి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 55వ డివిజన్లో టెండర్లు పూర్తయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. భీమారం, గోపాలపూర్, కోమటిపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు మంజూరైనా ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టెండర్లు పూర్తయిన పనులకు సుమారు రూ.2 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నందున ఆలస్యం చేయకుండా పనులు పూర్తి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు

## రుణాలు సకాలంలో చెల్లించి రాయితీలు పొందాలి



**బేతవోలు, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
ప్రాథమిక సహకార సంఘంలో రైతులు తీసుకున్న స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించి ప్రభుత్వ రాయితీలు పొందాలని సంఘం చైర్మన్ బజ్జూరి రవీందర్రెడ్డి సూచించారు. సోమవారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. రైతులకు ఎరువుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సంఘం సీఈఓ సయ్యద్ బాషా సంఘం లావాదేవీల నివేదికను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాధవ గూడెం సర్పంచ్ దాసరాజు వీరబాబు సంఘం డైరక్టర్లు, రైతులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## కుల రహిత సమాజమే లక్ష్యంగా భవిష్యత్ పోరాటం



**వనపర్తి : సెప్టెంబర్ 28, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
హైదరాబాద్లో నిర్వహించిన ఎం.ఈ.ఎఫ్ జాతీయ సమావేశములో మందకృష్ణ గద్వాల కృష్ణ ను శాలువ, మెమోంట్ తో సన్మానం చేసి, జాతీయ కోర్ కమిటీ వైస్ ఛైర్మన్ గా నియామకం ఉత్తర్వులు అందజేసినారు. ఈ సందర్భంగా గద్వాల కృష్ణ మాట్లాడుతూ మాదిగల సమగ్రాభివృద్ధి, పిడిత వర్గాల విముక్తి లక్ష్యంగా మందకృష్ణ మాదిగ బాట నడుస్తామని తెలియ జేశారు. కార్యక్రమంలో ఎం.ఈ.ఎఫ్.జాతీయ కోర్ కమిటీ అద్యక్షులు బోంత యేసుదాస్.జాతీయ అధ్యక్షులు బిక్షాలు, డా,ఎం. కృష్ణయ్య,మందా దేవెంద్ర ప్రసాద్ తదితరులు పాల్గోన్నారు.
విశ్వభారతి పాఠశాలపై ఆరోపణలు

## కుల ధ్రువీకరణ పత్రాల వ్యవహారంపై విచారణ జరపాలని ప్రజా సంఘాల డిమాండ్

**వనపర్తి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆత్మకూరు పట్టణంలోని విశ్వభారతి పాఠశాల నిర్వాహకులపై కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో పలు ఆరోపణలు వెలువడ్డాయి. పాఠశాల నిర్వాహకుడు ఎ. బాలరాజు కుటుంబానికి సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థుల టీసీల మార్పు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బాలరాజు కుటుంబ సభ్యుల కుల ధ్రువీకరణ పత్రాల్లో వ్యత్యాసాలు ఉన్నాయంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ, వాటి పరిశీలనకు సంబంధిత ప్రభుత్వ అధికారులకే చట్టబద్ధమైన బాధ్యత ఉంది. ఫిర్యాదుల్లో పేర్కొన్న ఆరోపణలు నిజమని విచారణలో తేలితే సంబంధిత సర్టిఫికెట్ల రద్దు, తదనంతర చట్టపరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని ప్రజా సంఘాలు పేర్కొన్నాయి. పాఠశాల గుర్తింపు, విద్యార్థుల రికార్డుల అంశాలపై కూడా అధికారులు పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ఎస్సీ కమిషన్కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొంటూ, దానిపై అధికారిక విచారణ పురోగతిని వెల్లడించాలని కోరారు.

## భగత్సింగ్కు జనసేన ఘన నివాళి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
అమరవీరుడు భగత్సింగ్ జయంతి సందర్భంగా చౌటుప్పల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. భగత్సింగ్ చిత్రపటానికి నాయకులు, జనసైనికులు పూలమాలలు వేసి ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా జనసేన నాయకుడు ఆముదాల పరమేశ్ మాట్లాడుతూ భగత్సింగ్ ధైర్యం, దేశభక్తి, త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పీక ప్రవీణ్, పెద్దగోని లింగస్వామి, కాసోజు గోపి, సంజయ్, పాశం శ్రీకాంత్, రమణబాబు, గొడుగు గణేశ్, దొడ్డి వంశీ, నజీర్ పాషా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ గోడను ఢీకొట్టిన కారు గుర్తింపు

**పరారీలో వాహనదారుడు.. పోలీసుల గాలింపు**

**కీసర, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని మహంకాళి ఆలయ ప్రహరీ గోడను ఢీకొట్టి పరారైన కారును కీసర పోలీసులు సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో గుర్తించారు. ఈ నెల 27న రాత్రి గుర్తుతెలియని కారు ఆలయ గోడను ఢీకొట్టి ధ్వంసం చేయగా, డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. పెట్రోలింగ్ సిబ్బంది బి. అఖిల్కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీటీవీ ఆధారాలతో ఎంజీ విండ్సర్ కారును గుర్తించారు. వాహన యజమాని కీసరకు చెందిన జలాలపురం సుధాకర్రెడ్డిగా గుర్తించి, అతని కోసం గాలిస్తున్నారు. కేసును ఛేదించిన కీసర ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్ఐలు శ్రీనివాస్, సాయికృష్ణలను మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ అభినందించారు. వివరాలను జవహర్నగర్ డివిజన్ ఏసీపీ ఎస్. చక్రపాణి వెల్లడించారు.

## ప్రభుత్వాసుపత్రి దుస్థితిపై అఖిలపక్షం ఆగ్రహం





**వనపర్తి, సెప్టెంబరు 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, పారిశుధ్యం, మౌలిక వసతుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆసుపత్రిని పరిశీలించి, రక్త నమూనాల సేకరణ ప్రదేశంలో ఆహార పదార్థాలు, చీపుర్లు, ఇతర సామగ్రి ఉండటాన్ని తప్పుబట్టారు. పెచ్చులూడుతున్న గోడలు, పారిశుధ్య లోపాలపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య సిబ్బందిని ఇతర పనులకు వినియోగించకుండా, గడువు ముగిసిన ఏజెన్సీ స్థానంలో కొత్త టెండర్ ద్వారా సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు కొత్తగొల్ల శంకర్, బీజేపీ నాయకుడు రవి, రామస్వామి, శివకుమార్, సురేష్ యాదవ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నస్పూర్ రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు మృతి

### లారీ--ఆటో ఢీ.. నలుగురికి తీవ్ర గాయాలు




**మంచిర్యాల, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
నస్పూర్ గేటు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు మృతి చెందగా, ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. మందమర్రి మండలం పొన్నారం, గుడిపల్లి, వెంకటాపూర్ గ్రామాలకు చెందిన మహిళలు మంచిర్యాలలోని ప్రైవేట్ షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తూ రోజువారీగా ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. టిప్పర్ లారీ--ఆటో ఢీకొనడంతో చింతకుట్ల లక్ష్మి, అగ్గు సౌందరయ్య అక్కడికక్కడే మృతి చెందగా, చికిత్స పొందుతూ సుమలత, తోటపల్లి సోనీ మృతి చెందారు. క్షతగాత్రులను కరీంనగర్, వరంగల్ ఆసుపత్రులకు తరలించారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మృతుల కుటుంబాలకు రూ.25 వేల చొప్పున, క్షతగాత్రులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ సంతాపం తెలిపారు. ప్రమాద స్థలాన్ని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్ పరిశీలించారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నామని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామని సీపీ తెలిపారు

## ఓటు హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ నిరసన

### మేడ్చల్‌లో ర్యాలీ.. సీఈసీ దిష్టిబొమ్మ దహనం



**మేడ్చల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, పీసరి మైపాల్ రెడ్డి, మహమ్మద్ ముజీబ్ రుద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, నరసింహులు యాదవ్, వేముల మహేష్ గౌడ్, బాలు రెడ్డి, సత్యనారాయణ, బీపీటీ రాజు, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాల శిక్షణార్థులకు అన్నదాన సేవ అభినందనీయం

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్‌లో కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల కోసం 200 మంది అభ్యర్థులకు నిర్వహిస్తున్న 60 రోజుల ఉచిత శిక్షణార్థం ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో రెండు నెలల ఉచిత అన్నప్రసాద సేవను జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణార్థులకు పోషకాహారంతో కూడిన అన్నప్రసాదం అందిస్తున్న ఇస్కాన్ నిర్వాహకులను అభినందించారు. అభ్యర్థులు శిక్షణ, వసతులను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అభ్యర్థులకు స్వయంగా భోజనం వడ్డించి, వారి శిక్షణ, పరీక్షల సన్నద్ధతపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి ప్రణవ నంద ప్రభుజీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి సోనియా, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షణార్థులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ ఒకచోట..

**1987--88 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**బీనుదేవరపల్లి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి )**
మూడు దశాబ్దాల విరామం అనంతరం 1987--88 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వంగర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది.ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల రోజులలో జరిగిన సరదా సంఘటనలు, ఆటపాటలు, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమ ప్రస్తుత కుటుంబ పరిస్థితులు, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో సాధించిన ప్రగతి, అనుభవాలను పరస్పరం పంచుకున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ పాత స్నేహబంధం తమను మళ్లీ ఒకచోట చేర్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితానికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గురువులకు శాలువాలు కప్పి సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. తమ జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వారు




గుర్తుచేసుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనం పాత జ్ఞాపకాలను తిరిగి గుర్తుచేసి తమలో నూతన ఉత్సాహాన్ని నింపిందని పూర్వ విద్యార్థులు అన్నారు. భవిష్యత్తులోనూ తరచూ ఇలాంటి సమావేశాలు నిర్వహించుకుని స్నేహబంధాన్ని కొనసాగించాలని నిర్ణయించారు.కార్యక్రమంలో జి. ఉమ, ఆర్.విజయ, ధనలక్ష్మి, డాక్టర్. బి.సర్దార్ పటేల్, బల్లు రమేష్, కే.నవీన్, వై.బాబు, గడిపే రాజు, పి.రమేష్, మాజీ సర్పంచ్ మంచాల వెంకటస్వామి, కే.తిరుపతిరెడ్డి, కె.స్వామి. వై. రవి తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## విలేకరులమంటూ లారీ అడ్డగించి రూ.1.20 లక్షలు డిమాండ్

**నలుగురిని అరెస్టు చేసిన ఎల్లారెడ్డి పోలీసులు**

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: మల్లయ్యపల్లి గ్రామ శివారులో వడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీని అడ్డగించి, తాము విలేకరులమని చెప్పి డ్రైవర్‌ను బెదిరిస్తూ రూ.1.20 లక్షలు డిమాండ్ చేసిన కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 26న జరిగిన ఘటనపై లారీ డ్రైవర్ చాకినాల సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాలతో, డీఎస్పీ ఎస్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేసి మహమ్మద్ అబ్దుల్ మోసిన్, ఎడ్ల మహేష్ కుమార్, బుద్దె ఆనంద్, గాండ్ల సుధీర్ కుమార్‌లను అరెస్టు చేశారు. నిందితులు లారీని వ్యాగనర్ కారుతో అడ్డగించి, పత్రాలు చూపించాలని కోరడంతోపాటు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున



మొత్తం రూ.1.20 లక్షలు ఇవ్వాలని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి వ్యాగనర్ కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసిన ఎల్లారెడ్డి పోలీసులను ఎస్పీ అభినందించారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు డీఎస్పీ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు.

## లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుకై లబ్ధిదారుల ఎంపిక

**నిజామాబాద్, సెప్టెంబర్ 28 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిజామాబాద్ నార్త్ మండలం పరిధిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమీపంలో గల రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు కోసం సోమవారం మున్సిపల్ సిటిజన్ సర్వీస్ సెంటర్ భవనంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ లక్కీ డ్రా నిర్వహించారు. నగర మేయర్ కూరగాయల ఉమారాణి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ల పర్యవేక్షణలో ఈ లాటరీ ప్రక్రియ జరిగింది. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ అర్హత కలిగిన వారి పేర్లను అందరి సమక్షంలో డ్రా తీస్తూ లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారు. ఎలాంటి పొరపాట్లు, అనుమానాలకు తావు లేకుండా వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అర్హులుగా ఖరారైన







దరఖాస్తుదారుల సమక్షంలో, వీడియోగ్రఫీ చిత్రీకరణ మధ్య పూర్తి పారదర్శకంగా లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను విజయవంతంగా జరిపించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎస్టీ లకు 6 శాతం, ఎస్సీలకు 17 శాతం, మైనారిటీలకు 12 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున రిజర్వేషన్లను అమలు చేస్తూ లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేస్తూ పేర్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ బి.చంద్రశేఖర్, హౌసింగ్ ఈ.ఈ జె.రాజ్యలక్ష్మి, నార్త్ తహసీల్దార్ హరికిశోర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, లాటరీ ద్వారా రెండు పడక గదుల ఇల్లు కేటాయించబడిన లబ్ధిదారులు తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు ప్రకటించారు.

## మదర్‌హుడ్ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్‌కు ఆర్ఎస్‌పీ రెండోసారి ఫిర్యాదు



**నిజామాబాద్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
ఇందూరు మదర్‌హుడ్ ఆసుపత్రిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్ఎస్‌పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాధితురాలు కమ్మరి అఖిలతో కలిసి సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు రెండోసారి ఫిర్యాదు చేశారు. అధిక బిల్లులు వసూలు చేసి ప్రసూతి మహిళను ఇబ్బందులకు గురిచేశారని ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి కటారి రాములు ఆరోపించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఘటనపై ఇప్పటికే జిల్లా వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు తక్షణం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమ్మరి అఖిల, మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కే. లావణ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ నిరసన

**కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా**

**కామారెడ్డి, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఓటు హక్కు పరిరక్షణ, పారదర్శకమైన ఓటర్ల జాబితా, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన నిర్వహించారు. టీపీసీసీ ఆదేశాల మేరకు డీసీసీ



అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల దుస్తులు ధరించి నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కామారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రజావాణి ద్వారా అందే ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి హామీ, భూభారతి తదితర అంశాలపై కలెక్టరేట్ స్థాయిలో 55, మండల స్థాయిలో 58 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోగా పరిష్కరించి, తీసుకున్న చర్యలను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఒకే సమస్యపై పునరావృత ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఆర్.ఎస్. చిత్రు, డీఆర్వో స్రవంతి, ఏ. ఓ. ఎస్తేర్ వర్ణ,వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## రేపు ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్--14, 17 లాన్ టెన్నిస్ ఎంపికలు

**ఖమ్మం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్--14, అండర్--17 బాలబాలికల లాన్ టెన్నిస్ జట్ల ఎంపికలు ఈ నెల 30న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని లాన్ టెన్నిస్ కోర్టులో నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శులు యాస రామారావు, బి. బావ్‌సింగ్ తెలిపారు.ఎంపికలకు అర్హత కలిగిన క్రీడాకారులు సెప్టెంబర్ 30న ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు. అండర్--14 విభాగంలో 01-01-2013 తర్వాత జన్మించి 6వ తరగతి నుంచి పై తరగతులు చదువుతున్న వారు, అండర్--17 విభాగంలో 01-01-2010 తర్వాత జన్మించి 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, ఎస్జీఎఫ్ ఎలిజిబిలిటీ ఫామ్, ఆధార్ జిరాక్స్, పుట్టిన తేదీ ధ్రువపత్రం తీసుకురావాలని సూచించారు. ఇంటర్మీ డియట్ విద్యార్థులు పదో తరగతి మార్కుల మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్ కూడా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కోచ్ కైలాస్ (7979940287)ను సంప్రదించాలని కోరారు.

## ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ నిరసన




**మంచిర్యాల, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న అభ్యంతరాల నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు.డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలే యువతకు దిక్సూచి

### మేడ్చల్ బార్ అసోసియేషన్‌లో ఘనంగా జయంతి వేడుకలు




**మేడ్చల్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి):**
భగత్‌సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత సమాజ పురోగతికి కృషి చేయాలని జనసేన నాయకుడు, న్యాయవాది రవి రాజ్ రాథోడ్ పిలుపునిచ్చారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ ప్రాంగణంలో ఆయన ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి రాజ్ రాథోడ్ మాట్లాడుతూ భగత్‌సింగ్ త్యాగం, సాహసం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు బాధ్యతాయుతమైన ప్రజాసేవ కోసం కొత్తతరం రాజకీయాల్లోకి రావాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మురళి నాయక్‌తో పాటు పలువురు న్యాయవాదులు, న్యాయవాద సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఈసీ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

### ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ భారీ నిరసన, ధర్నా



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్‌లో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ నాయకత్వంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొని సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఇదే డిమాండ్‌తో నిరసనలు నిర్వహించింది.గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్‌లో విగ్రహాలకు నివాళులర్పించిన అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. దిష్టిబొమ్మ దహనాన్ని పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాబూ రావు, కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్, గంద్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి, బండారి అనూష సతీష్, మల్లెపూల సత్యనారాయణ, అశోక్ రెడ్డి, కొమరం సత్యవతి కోటేష్, రాజు యాదవ్, గిమ్మ సంతోష్, ఆసిఫ్ ఖాన్, ఖిజర్ పాషా, పరమేశ్వర్, సేద్మకి ఆనంద్‌రావు, అన్నపూర్ణ, కపిల్, మోతి రామ్, షాహిద్, బూరుగుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## విషపూరిత కలుపు మందు 'పారాక్వాట్'పై కేంద్రం నిషేధం

వ్యవసాయ రంగంలో విరివిగా వినియోగించే ప్రమాదకరమైన కలుపు నివారిణి 'పారాక్వాట్ డైక్లోరైడ్' తయారీ, విక్రయాలు, వినియోగంపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. ఈ రసాయనం మానవులతో పాటు పశుసంపదకు తీవ్రమైన హాని కలిగిస్తుందని నిర్ధారణ కావడంతో, తక్షణ చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కీటకనాశనుల చట్టం-1968 లోని సెక్షన్ 27, 28 నిబంధనల ప్రకారం కేంద్రం ఈ నిషేధాజ్ఞలు అమలులోకి తెచ్చింది. గతంలోనే ఈ మందును నిషేధించాలని భావించిన ప్రభుత్వం, జూలై 10న ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చి ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలను స్వీకరించింది. వాటిని పరిశీలించడంతో పాటు ఇందుకోసం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నివేదిక, రిజిస్ట్రేషన్ కమిటీ సిఫారసుల ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంది.

## జావాణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

**అధికారులను ఆదేశించిన భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ**



**భద్రాచలం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించి, ప్రజల సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.

రెవెన్యూ, భూ సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, నిరుద్యోగుల సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగతంగా పర్యవేక్షించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సుధీర్, డీఏవో భగవాన్‌రెడ్డి, వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఖ

## రేబిస్‌పై విస్తృత అవగాహన కల్పించాలి

**రేబిస్ నివారణకు టీకాలే ప్రధాన మార్గం: కలెక్టర్ దివాకర టీఎస్**



**ఖమ్మం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో)**
: రేబిస్ వ్యాధి నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కుక్క కాటుకు గురైన వెంటనే గాయాన్ని సబ్బు, నీటితో శుభ్రం చేసి, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి టీకా తీసుకోవాలని సూచించారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, వాటి దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం--2026 పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వృద్ధుల సంక్షేమం, సాధికారతకు సంబంధించిన సహాయం కోసం ఎల్డర్‌లైన్ 14567ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టాస్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అక్టోబర్ 11 నుంచి 17 వరకు పరీక్షలు..**

**948 మంది విద్యార్థులు హాజరు**



**ఖమ్మం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):**
తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో పదో తరగతికి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఇంటర్‌కు జీహెచ్‌ఎస్ రికాబ్‌బజార్‌ను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 537 మంది పదో తరగతి, 411 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ప్రథమ చికిత్స, పోలీసు బందోబస్తు, ప్రశ్నాపత్రాల భద్రత వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పరిసరాల్లోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని, నిబంధనల ప్రకారం బీఎన్‌ఎస్ 163 అమలు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి సదానందం, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**అధికారులను ఆదేశించిన కలెక్టర్ దివాకర టీఎస్**

**ఖమ్మం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):**
ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.సింగరేణి మండలం పేరుపల్లిలో రూ.6 లక్షల అక్రమ బిల్లుల చెల్లింపులపై విచారణకు ఆదేశించారు. చింతకాని మండలం లచ్చగూడెంలో పెసర కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వచ్చిన దరఖాస్తుపై మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. కల్లూరు మండలం పేరువంచలో భూ ఆక్రమణ ఫిర్యాదుపై తహసీల్దార్ ద్వారా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూసుమంచి మండలం తురకగూడెంలో నిలిచిపోయిన ఫైలేరియా పింఛన్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవోను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# తాడికల్ సర్పంచ్ సుజాత మరణం దురదృష్టకరం

- అభినందించిన చేతులతో నివాళు లర్పించడం బాధాకరం
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**శంకరపట్నం, సెప్టెంబర్ 28 (తెలంగాణ వాణి)**
మండలంలోని తాడికల్ గ్రామ సర్పంచ్ దుర్గపు సుజాత అనారోగ్యంతో మృతి చెందడం గ్రామ ప్రజలకు, గ్రామపంచాయతీకి దురదృష్టకరమని, తీరని లోటని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం ఉపసర్పంచ్ ప్రవీణ్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడో ప్రయత్నంలో సుజాత సర్పంచ్ గా విజయం సాధించగా తాను ఆమెను అభినందించానని, అదే చేతులతో నేడు నివాళులర్పించాల్సి రావడం, సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలల్లోనే అనారోగ్యంతో మరణించడం బాధాకరంగా ఉందన్నారు. సుజాత గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేశారని, కొద్దిరోజుల కాలంలోనే గ్రామంలో మంచి పేరును గుర్తింపుని తెచ్చుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాల అమలులో చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరికీ అందుబాటులో ఉండే నాయకురాలిగా గుర్తింపు పొందారని అన్నారు.సుజాత ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులకే కాకుండా గ్రామ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తీరని లోటని పేర్కొన్నారు. ఆమె ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని పాలకవర్గ సభ్యులు కొనసాగించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం సుజాత కలలు కన్న లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిత, మాజీ జడ్పీటీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్లు సంపత్, బసవయ్య, మహేష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఉపసర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆకుబత్తిని విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు గొట్టే మధు, స్థానిక వార్డు మెంబర్లు తదితరులు పాల్గొని సుజాతకు నివాళులర్పించాలరు.

## యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**పక్కా క్యాలెండర్‌తో పనులు పూర్తి చేయాలి**

**నిరంతర పర్యవేక్షణకు సీసీ కెమెరాలు**

**వచ్చే నెల నుంచి నా ఆకస్మిక తనిఖీలు**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాభవన్‌లో ఆయన ఈ ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పేద విద్యార్థులందరికీ ఒకే ప్రాంగణంలో అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. నిర్మాణాలకు సంబంధించి జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ప్రత్యేక 'వర్క్ క్యాలెండర్' రూపొందించాలని అధికారులకు సూచించారు. అధికారులు రాత్రింబవళ్లు శ్రమించి పనులు పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు తనకు నివేదికలు పంపాలని ఆదేశించారు. పనుల పర్యవేక్షణకు నిర్మాణ ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వచ్చే నెల రెండో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా తాను స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేపడతానని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఈఎంసీ గణపతి రెడ్డి ప్రాజెక్టు పురోగతిని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 87 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలు మంజూరు కాగా, 70 చోట్ల ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయన్నారు. మరో 5 స్కూళ్లకు డీపీఆర్ సిద్ధమవుతోందని, 3 టెండర్ల దశలో ఉన్నాయని, 4 చోట్ల స్థల సమస్యలు ఉన్నాయని తెలిపారు. గడువులోగా పనులన్నీ పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తెస్తామని అధికారులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు.

## గ్రేటర్ మున్సిపోల్స్‌తోపాటు స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్ : టీఆర్ఎస్ చీఫ్ కవిత



రాబోయే స్థానిక సంస్థలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటాలని.. అందుకు తగిన విధంగా సిద్ధం కావాలని పార్టీ కేడర్‌కు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రానున్న కాలంలో పార్టీ నేతలు, క్యాడర్ నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తున్నారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల నేతలతో భేటీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్‌లు, సిద్దిపేట సహా ఇతర మున్సిపాలిటీల్లో పోటీ చేసి సత్తా చాటాలని నేతలకు సూచించారు. నిజామాబాద్, కొడంగల్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలకు సంబంధించి ప్రజల నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా టీఆర్ఎస్ ఎలాంటి పాత్ర పోషించాలని ప్రజలు కోరుకుంటున్నారు, ఇంకా ఎలాంటి కార్యక్రమాలు ఉంటే బాగుంటుందని భావిస్తున్నారో ఆ దిశలోనే పయనిద్దామని సూచించారు. టీఆర్ఎస్ చేస్తున్న పోరాటాలతోనే ప్రభుత్వంలో కదలిక వస్తుందని కవిత చెప్పారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం జరిగి ఐదుగురు చిన్నారులు మృతి చెందిన ఘటనలో తెలంగాణ రక్షణ సేన స్పందించిన తీరుతోనే ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. ఏళ్లకేళ్లుగా రిమ్స్ హాస్పిటల్ ను పట్టించుకోని ప్రభుత్వం తక్షణ చర్యల కోసం రూ.11 కోట్లు రిలీజ్ చేసిందని చెప్పారు. రిమ్స్ హాస్పిటల్ సమస్యలపై రివ్యూ చేసి చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. తాను ఆస్పత్రిని విజిట్ చేసి బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా నిలిచిన తర్వాతనే ప్రభుత్వం దిగివచ్చి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందన్నారు. కాగా.. గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో త్వరలోనే హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు

ప్రభుత్వం తీరుతో తెలంగాణ మెడికల్ విద్యార్థులకు నష్టం జరుగుతున్నదని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తెచ్చిన జీవో కారణంగా తెలంగాణ బిడ్డలు రక్షణలు కోల్పోయే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. ఈ విపత్తుకు వ్యతిరేకంగా తెలంగాణ సమాజమంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మెడికల్ సీట్లకు సంబంధించి స్థానికత అంశంలో ప్రభుత్వ నిర్ణయం కారణంగా మన పిల్లలకు నష్టం జరుగుతున్నదని.. ఇతర రాష్ట్రాల పిల్లలకు మేలు జరుగుతుందని తెలిపారు. అలాంటి ఈ అంశాన్ని సరిదిద్దుకోవాల్సింది పోయి.. సుప్రీంకోర్టులో ఈ అంశాన్ని ప్రభుత్వం డిఫెండ్ చేస్తున్నదని పేర్కొనారు. మొదట జీవో 33 ఇచ్చారని.. దాన్ని ఎక్స్‌టెన్డ్ చేస్తూ జీవో 150 తెచ్చారని పేర్కొన్నారు. 1 వ తరగతి నుంచి 7 వ తరగతి వరకు ఇక్కడ చదువుకున్న వాళ్లను స్థానికులుగా భావించాలని.. కానీ, 8 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న వాళ్లు లోకల్ అనేలా జీవో తెచ్చారని ఆరోపించారు. దీన్ని కచ్చితంగా ప్రశ్నించాలని.. ఇప్పుడు మెడికల్ సీట్ల వరకే ఉన్న ఈ జీవోను అన్ని రంగాల్లోకి తెస్తారని చెప్పారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com